సాక్షి
మంచిర్యాల
బుధవారం, 25, జనవరి, 2023



**ఓటరా.. మీదే నిర్ణయం**
భారత రాజ్యాంగం 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తోంది. ఓటే భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. నేడు జాతీయ ఓటరు దినోత్సవం. 8లో▸



**ఘనంగా బాలికల దినోత్సవం**
జాతీయ బాలికల దినోత్సవం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. చెన్నూర్‌లో విద్యార్థినులు ముగ్గులతో వేసిన బాలిక చిత్రం ఆకట్టుకుంది. 9లో▸

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
31.0 /17.0
ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. నైరుతి దిశగా చలిగాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

మంచిర్యాలటౌన్: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 25న ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కే.నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

### 32 పోస్టులకు 2,835 దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న 32 ఔట్ సోర్సింగ్ పోస్టులకు 2,835 మంది దరఖాస్తు వచ్చినట్లు శాన్వీ సర్వీసెస్ నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల వివరాలు కంప్యూటర్‌లో నిక్షిప్తం చేశామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 1వరకు నివృత్తి చేసుకోవాలని, దరఖాస్తు వివరాలను హౌస్‌నెంబర్ 3-408/16 ఆసియన్ టవర్స్ వెనక వైపు, పవన్ నిలయం, హైటెక్ సిటీ మంచిర్యాలలో చూసుకోవాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలోనూ అభ్యంతరాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు.

### 5,632 మందికి కంటి పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: జిల్లాలోని 40 క్యాంపుల్లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాల్లో మంగళవారం 5,632 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1,493 మందికి రీడింగ్ గ్లాసులు అందించగా, కంటి సమస్యలు ఎక్కువ ఉన్న వారిలో 925 మందిని గుర్తించారు.

### నేడు టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన

మంచిర్యాలఅర్బన్: స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు అర్హులైన ఎస్జీటీ, తత్సమాన ఉపాధ్యాయుల ఒరిజినల్ సర్వీసు పుస్తకం, సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 25న నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. లోకల్ బాడీ టీచర్లు(టీఎం), ఎస్ఏ(పీడీ) డీఎస్సీ 2003 అభ్యర్థులు, ఎస్ఏ(గణితం) డీఎస్సీ 2002, ఎస్ఏ(బయోసైన్స్) 2002 డీఎస్సీ, ఎస్ఏ సోషల్-2002 డీఎస్సీ, ఎస్ఏ తెలుగు 2000 డీఎస్సీ, ఎస్ఏ హిందీ-2002 డీఎస్సీ, ఎస్ఏ ఇంగ్లిష్-2000 డీఎస్సీ, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం -1998 డీఎస్సీ అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల టీచర్లు ఎస్ఏ(ఫిజికల్ సైన్స్) తెలుగు మీడియం-2008 డీఎస్సీ, ఎస్ఏ బయోసైన్స్-2008 డీఎస్సీ, ఎస్ఏ సోషల్- ఆల్, ఎస్ఏ- హిందీ, ఎఫ్ఎల్ఎల్ హెచ్ఎం(టీఎం) 2008 డీఎస్సీ అభ్యర్థులతోపాటు లోకల్ బాడీ(ఉర్దూ మీడియం) అందరూ స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్ల కోసం ఎస్జీటీ, తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్వీసు పుస్తకం, సర్టిఫికెట్ల పరిశీలనకు 5గంటల్లోపు హాజరుకావాలని సూచించారు. ఎస్ఏ ప్రమోషన్ల కోసం అర్హులైన పీహెచ్‌సీ అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని తెలిపారు.

### యువజన కాంగ్రెస్ సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమల్‌రావు

మంచిర్యాలటౌన్: పోలీసు నియామకాల్లో అవకతవకలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఐబీ చౌరస్తాలో సంతకాల సేకరణ చేపట్టారు. యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమల్‌రావు మాట్లాడుతూ నిబంధనలు ఇబ్బందికరంగా ఉన్నాయని, పాత పద్ధతిలోనే ఎంపిక చేపట్టాలని అన్నారు. పరుగుపందెంలో ఉత్తీర్ణులైన వారందరినీ మెయిన్స్ పరీక్షకు అనుమతించాలని, హైకోర్టు తీర్పు ప్రకారం అర్హులకు ఏడు మార్కులు కలపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అజయ్‌గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు అడెపు రవి, రచ్చ నరేష్, వంశీ, రోహిత్, రాజు, శ్రీనివాస్, రాజేష్, గోపి, లోకేష్, సందీప్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# అద్దె.. చోరులపై నజర్!



ఇటీవల జిల్లా కేంద్రం మంచిర్యాలలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. అద్దెకు ఉంటామని నమ్మించి కొందరు ఇంట్లో చేరారు. మరుసటి రోజే ఆ ఇంట్లో అద్దెకు ఉన్నవాళ్లు పట్టణంలో దొంగతనానికి పాల్పడ్డారు. ఊరు, పేరు, వృత్తి తెలుసుకోకుండా ఇల్లు అద్దెకు ఇవ్వడంతో కొన్ని సార్లు ఈ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో పట్టణాల్లో ప్రతీ ఇంట్లో ఆ ఇంటి యజమాని, అద్దెకు ఉండే వారి వివరాలు పోలీసు శాఖ సేకరిస్తోంది. ముఖ్యంగా జిల్లా కేంద్రం, సింగరేణి కార్మికవాడల్లో వేలాది మంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి, వలస వచ్చి ఇక్కడ ఉద్యోగ, ఉపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ ఇంట్లో ఉండే వారి వివరాలు పోలీసు శాఖ వద్ద ఉండేలా సమగ్ర సర్వే చేపట్టారు.

- పట్టణాల్లో పోలీసుల ఇంటింటి సర్వే
- ఇళ్ల యజమానులు, అద్దెకున్న వారి వివరాల సేకరణ
- జిల్లా కేంద్రంతో సహా అన్ని ప్రాంతాలపై దృష్టి

| 2022లో జరిగిన దొంగతనాలు | |
|---|---|
| దోపిడీ 03 | బందిపోటు దొంగతనం 01 |
| సాధారణ దొంగతనాలు 164 | |

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్న నేపథ్యంలో నియంత్రణకు పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. అపరిచిత, అనుమానాస్పద వ్యక్తులను ఓ కంట కనిపెట్టేందుకు ఇంటింటికి ఓ సర్వే చేపడుతోంది. ముఖ్యంగా పట్టణాల్లో నివాసం పేరుతో ఇళ్లు అద్దెకు తీసుకుని దొంగతనాలు, నేరాలకు పాల్పడే వారిపై నజర్ పెట్టింది. ఈ మేరకు గత నాలుగు రోజులుగా మంచిర్యాల పట్టణంలో ఇంటింటికి తిరుగుతూ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా అద్దెకు ఏప్రాంతం నుంచి వచ్చిన వాళ్లు ఉంటున్నారు? బీహార్, యూపీ, మహారాష్ట్ర తదితర ఉత్తర భారతదేశానికి చెందిన వాళ్లు, ఉద్యోగం, వృత్తి, తమ ఆధార్, కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. పట్టణాల్లో నేరాలకు పాల్పడే అనుమానం ఉన్న వారిపై ముందస్తు జాగ్రత్తగా సమాచారం సేకరిస్తున్నారు. ఈ వివరాలన్నీ ఆయా పోలీసుస్టేషన్లలో పొందుపరుచుకుంటే ఏదైనా ప్రాంతంలో దొంగతనం, ఇతర నేరాలు జరిగితే సులువుగా వ్యక్తులను గుర్తించేందుకు వీలు చిక్కుతుంది. అంతేకాక ఇంటి యాజమానులను సైతం, తమ ఇంట్లో ఉంటున్న అద్దెవారి పూర్తి చిరునామా తెలుసుకుని ఇల్లు కిరాయికి ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నారు.

**పట్టపగలే చోరీలు..**
గత కొంత కాలంగా జిల్లాలో పట్టపగలే చోరీలు జరుగుతున్న ఘటనలు ఉన్నాయి. కార్మిక వాడల్లో తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు జరుగుతున్నాయి. ఇంట్లోని విలువైన వస్తువులు, బంగారం, నగదు, వాహనాలు అపహరణకు గురవుతున్నాయి. జిల్లా పారిశ్రామిక ప్రాంతంగా ఉండడంతో నిత్యం అనేక మంది రోడ్డు, రైలు మార్గాల ద్వారా ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. కొందరు దుండగులు రైలు మార్గంలో వచ్చి దొంగతనాలకు పాల్పడి రాష్ట్రాలు దాటేస్తున్నారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు పట్టుబడిన వాళ్లు ఉన్నారు. ఇంటికి తాళం వేసి ఉంటే మధ్యాహ్నం రెక్కీ నిర్వహించి, రాత్రి వేళ చోరీలు కూడా జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో దొంగిలించిన సొత్తు తిరిగి స్వాధీనం చేసుకోవడంలో జాప్యం జరుగుతోంది. వీటితోపాటు వ్యాపార కేంద్రాలు, ఏటీఎంలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు దొంగిలిస్తున్నారు. దీంతో బాధితులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ విషయమై డీసీపీ అఖిల్ మహాజన్ 'సాక్షి'తో మాట్లాడుతూ జిల్లాలో దొంగతనాల అదుపు కోసం పట్టణాల్లో పలు కాలనీల్లో అద్దెకు ఉంటున్న వారి వివరాలు తెలుసుకునేందుకే సర్వే చేపట్టినట్లు తెలిపారు. నేర నియంత్రణకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

# వైద్యరంగానికి ప్రాధాన్యం


బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కలెక్టర్ భారతిహోళ్లికేరి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- బస్తీదవాఖాన ప్రారంభం

బెల్లంపల్లి: వైద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీలో బస్తీ దవాఖానాను కలెక్టర్ భారతిహోళ్లికేరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బెల్లంపల్లిలో సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి వంద పడకల ఏరియా ఆస్పత్రి, కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ కేంద్రం ప్రారంభించినట్లు తెలిపారు. కలెక్టర్ భారతిహోళ్లికేరి మాట్లాడుతూ పేదలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో బస్తీ దవాఖానాను మంజూరు చేసినట్లు తెలిపారు.

**ప్రజాప్రతినిధుల నిరసన**
ప్రోటోకాల్ పాటించలేదంటూ పలువురు ప్రజాప్రతినిధులు నిరసన తెలిపారు. బస్తీ దవాఖాన ప్రారంభోత్సవ శిలాఫలకంపై మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ల పేర్లు లేకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు. మున్సిపల్, వైద్యాధికారులను పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించారు. శిలాఫలకంపై పేర్లు లేకుండా చేసి అవమానిస్తున్నారని కలెక్టర్‌తో ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కౌన్సిలర్లను అవమానించడాన్ని మానుకోవాలని కౌన్సిలర్లు దామెర శ్రీనివాస్, రాములునాయక్, కె.చంద్రశేఖర్ తదితరులు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ విజయపూర్ణిమ, డీపీఓ ప్రశాంతి, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, కౌన్సిలర్ టీ.సుజాత తదితరులు పాల్గొన్నారు.

**కంటి వెలుగు శిబిరాల సందర్శన**
బెల్లంపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాలు, మున్సిపల్ చిల్డ్రన్స్ పార్కును కలెక్టర్ భారతి హోళ్లికేరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒకటో వార్డు కన్నాలబస్తీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 18వార్డులోని శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో శిబిరాలను సందర్శించారు. 4వ వార్డు పరిధిలో చిల్డ్రన్స్ పార్కును పర్యవేక్షించారు.

# తడి, పొడి చెత్త వేరు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలటౌన్: చెత్తను ఎరువుగా మార్చేందుకు ఇళ్లలోనే తడి, పొడి చెత్త వేరు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మంచిర్యాల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం తడి, పొడి చెత్త వేరు చేయడం, లాభాలపై మున్సిపాల్టీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి ఇస్తే కంపోస్టు ఎరువు తయారీకి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ, టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు శారద పాల్గొన్నారు.

**లక్ష్యాన్ని నెరవేర్చాలి**
భీమిని: కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మంగళవారం భీమిని, కన్నెపల్లి మండలాల్లోని కంటి వెలుగు కేంద్రాలను ఆయన పరిశీలించారు. భీమిని జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి డీపీఓ ఫణీందర్‌రావు, ఎంపీడీఓ రాధాకిషన్, ఎంపీఓలు సబ్దర్‌అలీ, సతీస్‌కుమార్, తహసీల్దార్లు రాంచందర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్

# ఆడపిల్లలకు చదువు తప్పనిసరి

- జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య
- ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

మంచిర్యాలటౌన్: ఆడపిల్లలకు చదువు తప్పనిసరిగా చెప్పించాలని, జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగేందుకు విద్యనే తోడుంటుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని సాయికుంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం జిల్లా సంక్షేమశాఖ, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్ మాట్లాడుతూ ఆడపిల్లలు సమాజంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా పరిష్కరించుకోవాలని అన్నారు. బాలికల సాధికారత వారి చేతుల్లోనే ఉందని, చదువు ద్వారానే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. అనంతరం జాతీయ బాలిక దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నీలిమ, సీడీపీవోలు స్వరూపరాణి, హేమసత్య, చైల్డ్ హెల్ప్‌లైన్ సమన్వయకర్త ముడుపు సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచనదేవి, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, చైల్డ్‌లైన్ సిబ్బంది తిరుమల, వరలక్ష్మీ, రేణుక పాల్గొన్నారు.


పోస్టర్లు విడుదల చేస్తున్న జిల్లా సంక్షేమశాఖ అధికారి చిన్నయ్య

# గిరిజన దర్బార్

- జనసంద్రమైన నాగోబా ఆలయం
- హాజరైన ఇద్దరు రాష్ట్ర మంత్రులు.. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు..
- ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు


సంప్రదాయ నృత్యం చేస్తున్న మహిళలు


నాగోబా ప్రతిమకు మంగళహారతి ఇస్తున్న మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్/ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతరలో భాగంగా మంగళవారం గిరిజన దర్బార్ అట్టహాసంగా సాగింది. రాష్ట్ర మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ రాకతో మెస్రం వంశీయుల్లో ఉత్సాహం నెలకొంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరందరికీ మెస్రం వంశ పెద్దలు తలపాగాలు ధరింపజేశారు. నాగోబా చిత్రపటాలను అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన దర్బార్‌లో వీరంతా పాల్గొన్నారు.

**సంప్రదాయ నృత్యాలతో ఘనస్వాగతం**
గిరిజన దర్బార్ సందర్భంగా కేస్లాపూర్‌కు వచ్చిన రాష్ట్ర మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు మెస్రం వంశీయులు ఘనస్వాగతం పలికారు. తొమ్మిది తెగలవారు సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆలయం వరకు స్వాగతించారు. డోలు, కాలికోం తదితర వాయిద్యాలతో హోరెత్తించారు. నాగోబా దర్శనం అనంతరం మెస్రం వంశీయులు బస చేసి ఉన్న గోవాడ్‌ను మంత్రులు సందర్శించారు. వంశ మహిళలతో కలిసి జొన్న గట్క ఉండలను తయారు చేశారు. గోవాడ్ చరిత్రను తెలుసుకున్నారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**
పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు బృందం సభ్యుల గుస్సాడీ నృత్యం ఆకట్టుకుంది. చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. భద్రాచలం ఆదివాసీల కళా బృందం సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలంగాణతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

**వినతుల స్వీకరణ**
దర్బార్‌లో భాగంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు దరఖాస్తు సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదివాసీ గిరిజనుల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. గిరి వికాసం పథకంలో వ్యవసాయ బోర్లు, భూహక్కు పత్రాలు, ఎడ్ల జతలు, ఎడ్ల బండ్లు తదితర పథకాల కోసం అర్జీలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులతోపాటు కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఆదిలాబాద్, కుమురంభీం జెడ్పీ చైర్‌పర్సన్‌లు రాథోడ్ జనార్దన్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీలు దండే విఠల్, రఘోత్తంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్, కోనేరు కోనప్ప, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు రిజ్వాన్ భాషాషేక్, నటరాజ్, మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ఆలయ కమిటీ సభ్యుడు వెంకట్‌రావు పటేల్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

### రిజర్వేషన్లలో మోసం చేసింది కేంద్రమే



గిరిజనుల రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం మోసం చేసింది. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన దర్బార్‌ను బీజేపీ నేతలు రాజకీయ వేదికగా మార్చుకున్నారు. గత పాలకులుగిరిజనులను ఓటు బ్యాంక్‌గా వాడుకోగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వారి అభివృద్ధికి పాటుపడింది. విద్యుత్ లేని గ్రామాలకు సౌకర్యం కల్పిస్తాం. అవసరమైతే సోలార్ సిస్టమ్ ద్వారా వెలుగులు నింపుతాం.

– మంత్రి సత్యవతి రాథోడ్

### ఆలయ అభివృద్ధికి కృషి



నాగోబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం. ఇదివరకు రూ.15 కోట్లు ఖర్చు చేయగా, వీటిలో ఐటీడీఏ ద్వారా రూ.5 కోట్లు వెచ్చించాం. ఇతర సదుపాయాల కోసం రూ.12.50కోట్లు విడుదల చేశాం. పోడు రైతులకు పట్టాలు అందజేసి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం. కేంద్ర మంత్రి, ఎంపీలు బండి సంజయ్, సోయం బాపూరావు కేస్లాపూర్‌కు వచ్చినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఏజెన్సీలో ఇదివరకు విషజ్వరాలతో మృత్యువాత పడుతుండగా, ప్రస్తుతం గూడేల్లో విషజ్వరాల ముచ్చటే లేదు.

– మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

### మా హయాంలోనే అభివృద్ధి



మా ప్రభుత్వ హయాంలోనే కేస్లాపూర్‌ను అభివృద్ధి చేశాం. జోడేఘాట్‌ను కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేశాం. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై కుమురంభీం విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి పలుసార్లు విన్నవించినా స్పందనలేదు. ఖానాపూర్ నియోజకవర్గంలోని అటవీ ప్రాంతం గుండా ఉన్న గ్రామాలకు రోడ్ల నిర్మాణం కోసం కేంద్రం అనుమతులు ఇవ్వలేదు.

– ఎమ్మెల్యే రేఖానాయక్, ఖానాపూర్

### విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి



రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. గిరిజన గూడేలకు రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు భవన నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు కేటాయిస్తోంది. ఆదివాసీ గూడేలు, గ్రామాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది.

– దండే విఠల్, ఎమ్మెల్సీ

## క్లుప్తంగా

### జేసీబీ, ట్రాక్టర్లు పట్టివేత

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలంలోని గుడిపేట గ్రామ శివారులో అక్రమంగా మట్టి తరలింపునకు వినియోగిస్తున్న జేసీబీతో పాటు రెండు ట్రాక్టర్లను మంగళవారం రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు వెంటనే జేసీబీతో పాటు రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసిన వాహనాలను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలిచించారు. దాడుల్లో హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు, నాయబ్ తహసీల్దార్ హరిత పాల్గొన్నారు. మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా గోదావరి నుంచి ఇసుక, పంట పొలాలు, చెరువులు, ప్రాజెక్టుల నుంచి మట్టి తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### ఒకరి బైండోవర్

**మందమర్రిరూరల్:** నిబంధనలకు విరుద్ధంగా స్క్రాప్ వ్యాపారం చేస్తూ రెండోసారి పట్టుబడిన వడముల రమేష్‌ను మంగళవారం తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ ఎదుట ఎస్సై చంద్రకుమార్ బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రూ.2లక్షల జరిమానా విధించారు. ఇలాంటివి మరోసారి చేస్తే కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**రామకృష్ణాపూర్:** స్థానిక రవీంద్రఖని రైల్వేస్టేషన్ నుంచి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. అధికారులు దాడులు నిర్వహించి సుమారు 18క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం తరలిస్తున్న స్థానిక ఏజోన్ ప్రాంతానికి చెందిన రఫియా అధికారులపై అసభ్య పదజాలంతో దుర్భాషలాడింది. రాళ్లతో దాడి చేసే ప్రయత్నం కూడా చేయగా రెవెన్యూ అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో డీసీఎస్‌ఓ ప్రేంకుమార్, ఆర్ఐ రవికిషోర్, వీఆర్ఏ రాజ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

### ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ప్రతిభ



గోల్డ్ మెడల్ తీసుకుంటున్న సమ్మయ్య

**బెల్లంపల్లి:** ఈ నెల 21, 22 తేదీల్లో మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో తొమ్మిదవ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా తరపున ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య పాల్గొని సత్తా చాటాడు. షాట్‌పుట్ త్రో 45 ఏళ్ల విభాగంలో బంగారు పతకం గెలుచుకున్నాడు. దీంతో సీఐలు బాబురావు, రాజు, సిబ్బంది అభినందించారు.

### ఓటరు దినోత్సవ పోటీలు

**మంచిర్యాలఅర్బన్:** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులనుద్దేశించి సెక్టోరల్ అధికారి చౌదరి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన పౌరులకు ఓటు హక్కు ఉంటుందని, ఓటింగ్ సందర్భంలో ఎక్కడున్నా ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం కల్పించాలని సూచించారు. పోటీలకు సమన్వయకర్తగా గ్రీన్‌కోర్ కో–ఆర్డినేటర్ యోగేశ్వర్, న్యాయనిర్ణేతలుగా రాజగోపాల్, శ్రీనివాస్, నారాయణరావు, దత్తకుమార్ వ్యవహరించారు.



# ఓటరా.. మీదే నిర్ణయం!

- ఈ ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు
- మన ఓటే మన ప్రాంత భవిష్యత్
- ఈసారి నినాదం 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్'
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం

**సాక్షి ప్రతినిధి, మంచిర్యాల:** భారత రాజ్యాంగం 18ఏళ్లు నిండిన ప్రతీ పౌరునికి ఓటు హక్కు కల్పిస్తోంది. కుల, లింగ, ప్రాంత, వర్ణ, ధనిక, పేద, వర్గ తదితర తేడా లేకుండా అవకాశం ఇస్తోంది. తమ ప్రజాప్రతినిధులను తామే ఎన్నుకునే స్వేచ్ఛ ఉంది. ఓటుతో చట్టసభల్లో ఎవరిని కూర్చోబెట్టాలో నిర్ణయించవచ్చు. దేశంలో గ్రామ వార్డు సభ్యుడి నుంచి రాష్ట్రపతి వరకు ఓటు హక్కు ద్వారానే ఎన్నికలు సాగుతున్నాయి. ఈ క్రమంలో భారత ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఓటు ప్రాధాన్యత తెలియక, ఓటు వేయకపోవడంతోపాటు ఓటును ప్రలోభాలకు అమ్ముకోవడం వంటివి ప్రజాస్వామ్య విలువలను పాతరేస్తున్నాయి. ఈ ఏడాది భారత ఎన్నికల సంఘం 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్' (ఓటు లాగా ఇంకేదీ లేదు, నేను కచ్చితంగా ఓటేస్తా) అనే నినాదంతో ఓటు హక్కు పొందిన ప్రతీ ఒక్కరిని పోలింగ్‌లో భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశ్యంతో పిలుపునిచ్చింది.

### ఇప్పుడంతా ఆన్‌లైన్‌లోనే..

కొత్త ఓటరు నమోదు నుంచి, ఎపిక్ కార్డు పొందడం, ఆధార్ అనుసంధానం, అడ్రస్‌లో మార్పులు, చేర్పులు, ఫాంలు 6, 6ఏ, 6బీ, 7, 8 వరకు అన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. వివరాలకు భారత ఎన్నికల సంఘం అధికార వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు. లేకపోతే స్థానిక బూత్ లెవల్ ఆఫీసర్‌తో నేరుగా సంప్రదించి, ఓటరు కార్డు పొందడంతోపాటు ఇతర మార్పులు చేసుకోవచ్చు.

### గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతాలు.

| నియోజకవర్గం | 2014 | 2018 |
|---|---|---|
| సిర్పూరు | 78.88 | 85.93 |
| చెన్నూరు(ఎస్సీ) | 72.73 | 82.32 |
| బెల్లంపల్లి(ఎస్సీ) | 73.85 | 83.10 |
| మంచిర్యాల | 64.62 | 73.17 |
| ఆసిఫాబాద్(ఎస్టీ) | 77.10 | 86.00 |
| ఖానాపూర్(ఎస్టీ) | 73.77 | 80.50 |
| ఆదిలాబాద్ | 63.88 | 81.64 |
| బోథ్(ఎస్టీ) | 79.91 | 85.29 |
| నిర్మల్ | 76.89 | 79.13 |
| ముథోల్ | 78.76 | 84.02 |
| మొత్తం | 74.04 | 82.11 |

### ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

| నియోజకవర్గం | పురుషులు | స్త్రీలు | థర్డ్ జెండర్ | 18–19ఏళ్ల ఓటర్లు | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|---|
| సిర్పూర్ | 1,06,970 | 1,05,333 | 7 | 2,910 | 2,12,310 |
| చెన్నూర్(ఎస్సీ) | 88,497 | 87,947 | 11 | 1,692 | 1,76,455 |
| బెల్లంపల్లి(ఎస్సీ) | 80,894 | 80,341 | 14 | 1,222 | 1,61,249 |
| మంచిర్యాల | 1,24,769 | 1,24,193 | 20 | 1,696 | 2,48,982 |
| ఆసిఫాబాద్(ఎస్టీ) | 1,04,107 | 1,03,785 | 14 | 3,082 | 2,07,906 |
| ఖానాపూర్(ఎస్టీ) | 1,01,201 | 1,04,537 | 13 | 2,812 | 2,05,751 |
| ఆదిలాబాద్ | 1,11,039 | 1,14,016 | 7 | 3,055 | 2,25,062 |
| బోథ్(ఎస్టీ) | 98,456 | 1,02,576 | 2 | 3,885 | 2,01,034 |
| నిర్మల్ | 1,10,538 | 1,22,696 | 14 | 3,601 | 2,33,248 |
| ముథోల్ | 1,13,251 | 1,19,092 | 27 | 3,760 | 2,32,370 |

### గత అసెంబ్లీ ఎన్నికలు పరిశీలిస్తే

2018 డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల పోలింగ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది శాసనసభ నియోజకవర్గాల్లో సగటున 82.11 శాతం పోలింగ్ నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 90శాతం నమోదైంది. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ 71వ బూత్‌లో ఏకంగా 100 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇక్కడి ఓటర్ల చైతన్యం ఈ పోలింగ్ సరళి చెబుతోంది. ఆసిఫాబాద్‌లో 86, సిర్పూరులో 85.93, బోథ్‌లో 85.29 శాతం పోలింగ్ నమోదైంది. ఇక చెన్నూరు, బెల్లంపల్లి, ఆదిలాబాద్, ఖానాపూర్, ముథోల్, బోథ్‌లలో కూడా 80 నుంచి 85 శాతం వరకు పోలింగ్ నమోదైంది. పట్టణ ప్రాంత ప్రజలు విద్యావంతులుగా చెబుతున్నా.. చాలామంది ఓటు వేసే తీరిక లేకుండా పోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లోనే అత్యల్పంగా ఓట్లు నమోదు అవుతున్నాయి.



# ఎదురొచ్చిన మృత్యువు



బాదిరావు మృతదేహం



రాము(ఫైల్)

- ఎదురెదురుగా ఢీకొన్న ట్రాక్టర్, బైక్
- సంఘటన స్థలంలో ఒకరు, ఆస్పత్రికి తరలిస్తుండగా మరొకరు మృతి



బాదిరావును ఆటోలో ఎక్కిస్తున్న ఎంపీపీ మోతిరాం

**కెరమెరి(ఆసిఫాబాద్):** అప్పటి వరకు ఏవో కబుర్లు చెప్పుకుంటూ.. సంతోషంగా మోటార్ బైక్‌పై చల్లటి గాలిలో విహరిస్తూ ప్రయాణం చేస్తున్న వారికి మృత్యువు ఎదురొచ్చింది. ఒక్కసారిగా మూలమలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా.. మరోకరు రెండు గంటల పాటు ప్రాణాలతో విలవిల్లాడుతూ మృతి చెందిన విషాద ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది.

**ప్రాణం తీసిన మూలమలుపు**

కెరమెరి మండలంలోని జోడేఘాట్ చెందిన పెందోర్ రాము(35), కుమురం బాదిరావు(46) మంగళవారం జోడేఘాట్ నుంచి బైక్‌పై కెరమెరి వెళ్తున్నారు. జోడేఘాట్ వైపునకు వెళ్తున్న ట్రాక్టర్ బాబేఝరి(మహరాజ్‌గూడ) మూలమలుపు వద్ద ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో రాము అక్కడికక్కడే మృతి చెందగా బాదిరావు ఎగిరిపడ్డాడు. విషయం తెలుసుకున్న సమీప గ్రామాల ప్రజలు సంఘటనా స్థలానికి చేరినప్పటికీ ఎలాంటి సాయం చేయలేదు. విషయం తెలుసుకున్న ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఎస్సై వెంకటేశ్‌లు సంఘటన స్థలానికి చేరుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న బాదిరావును ఆటోలో కెరమెరి పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. సుమారు రెండు గంటల పాటు ప్రాణాలతో కొట్టుకుంటున్న బాదిరావును వెంటనే పీహెచ్‌సీకి తరలించి ఉంటే బతికేవాడని పలువురు చర్చించుకున్నారు.

**కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్‌గా!**

రాము సతీమణీ ఇందిరాబాయి ప్రస్తుత నిండు గర్భిణి, నలుగురు కొడుకులు, కూతురు ఉన్నారు. బాదిరావుకు భార్య లచ్చుబాయి, నలుగురు కొడుకులు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పెందోర్ రాము 2021లో కుమురం భీం ఉత్సవ కమిటీ చైర్మన్‌గా విధులు నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

### ఓటరు దినోత్సవంపై ఉపన్యాస పోటీలు

**మంచిర్యాలఅర్బన్:** జాతీయ ఓటరు దినోత్సవ సందర్భంగా మంగళవారం జిల్లాస్థాయి చిత్రలేఖనం, ఉపన్యాస, స్కిట్, వ్యాసరచన, పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల వివరాలను డీఈవో వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఉపన్యాస పోటీల్లో మంచిర్యాల జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలకు చెందిన శివనందిని (ప్రథమ బహుమతి), జన్నారం స్లేట్ హైస్కూల్‌కు చెందిన నజ్మీన్ (ద్వితీయ బహుమతి), పాటల పోటీల్లో జైపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి పూర్ణిమ (ప్రథమ బహుమతి), తాండూర్ కేజీబీవీ విద్యార్థిని నందిని(ద్వితీయ), వ్యాసరచన పోటీల్లో దండేపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎస్‌కె హుస్సెన్ (ప్రథమ), బెల్లంపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ విద్యార్థి అనిల్‌శర్వాన్ (ద్వితీయ), డ్రాయింగ్ పోటీల్లో సినిమావాడ హైస్కూల్ విద్యార్థి నిహార్ (ప్రథమ), పొన్నారం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన శ్రీకాంత్ (ద్వితీయ), స్కిట్ పోటీల్లో పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన చరణ్ బృందం ప్రత్యేక బహుమతి సాధించారు.

**జిల్లా స్థాయి విజేతలు వీరే..**

**మంచిర్యాలఅర్బన్:** మన ఊరిలో తడి, పొడి చెత్త విభజన నిర్వహణ మన బాధ్యత అనే అంశంపై విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలను డీఈవో వెంకటేశ్వర్లు ప్రకటించారు. ఇంగ్లిష్ మీడియంలో అచ్చలపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐశ్వర్య (ప్రథమ), భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అసంపల్లి ఎప్సీబా (ద్వితీయ), తెలుగు మీడియంలో కన్నెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వైష్ణవి (ప్రథమ), మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర పాఠశాల విద్యార్థి జీతేంద్రసింగ్ (ద్వితీయ) గెలుపొందారు. ఉపన్యాస పోటీల్లో నస్పూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పవన్‌కుమార్ (ప్రథమ బహుమతి), తాండూర్ మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థి రాంచరణ్‌తేజ(ద్వితీయ), తెలుగు మీడియంలో మంచిర్యాల జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థి అజయ్ (ప్రథమ), ముత్యంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఐశ్వర్య ద్వితీయ బహుమతి స్థానం సాధించారు. 26న బహుమతి ఇవ్వనున్నట్లు డీఈవో తెలిపారు.

# ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

- డైరెక్టర్(పా) చంద్రశేఖర్
- సీహెచ్‌పీ, ఇంటెక్ వెల్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం



ఇంటెక్‌వెల్‌లో నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్లు చంద్రశేఖర్, యస్.బలరాం

**శ్రీరాంపూర్:** ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి కంపెనీ పెద్ద పీట వేస్తోందని సింగరేణి డైరెక్టర్ (పా, ఆపరేషన్స్) ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మరో డైరెక్టర్ (పీపీ, ఫైనాన్స్) యస్.బలరాంతో కలిసి శ్రీరాంపూర్‌లో కంపెనీ సీహెచ్‌పీ ప్రాంగణంలో రూ.19.5 లక్షలతో నిర్మించిన స్టోర్‌షెడ్, రూ.24.45 లక్షలతో మెరిట్ బంకర్ వద్ద నిర్మించిన స్టాఫ్‌రూం, రూ.30 లక్షలతో ఇక్కడే నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అంతకు ముందు బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని సింగరేణి కాలనీలకు తాగునీటి వ్యవస్థ మెరుగుపర్చడం కోసం నూతనంగా రూ.6.72 లక్షలతో 6.6 కిలో మీటర్ల దూరం వేస్తున్న పైప్‌లైన్ నిర్మాణ పనులు సీతారాంపల్లి గోదావరి ఇంటెక్‌వెల్ వద్ద ఇద్దరు డైరెక్టర్‌లు శిలాఫలకం ఆవిష్కరించారు. త్వరలో రిటైర్డ్ కాబోతున్న డైరెక్టర్ చంద్రశేఖర్‌ను అధికారుల సంఘం అపెక్స్ సీనియర్ ఉపాధ్యక్షుడు ఏవీ రెడ్డి, ఏరియా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాధీర్, గుర్తింపు సంఘం నాయకులు సన్మానించారు.

**నాణ్యమైన బొగ్గుతోనే సంస్థ మనుగడ**

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేస్తేనే సంస్థ మనుగడ సాధిస్తుందని కంపెనీ డైరెక్టర్లు యస్ చంద్రశేఖర్(పా, ఆపరేషన్స్), యస్ బలరాం(పీపీ, ఫైనాన్స్) తెలిపారు. సీసీసీలోని సింగరేణి గెస్టు హౌజ్ కాన్ఫరెన్సు హాల్‌లో నిర్వహించిన సింగరేణి బొగ్గు నాణ్యత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన వాటిని కొనుగోలు చేయడానికి ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి, సివిల్ జీఎం రమేశ్‌బాబు, ఏరియా ఎస్‌ఓటూజీఎం త్యాగరాజు, డీజీఎంలు గోవిందరాజు, శివరావ్, చిరంజీవి, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, కార్పొరేట్ క్వాలిటీ జీఎం అబీబ్‌హుస్సేన్, బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం అల్లి రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### న్యాయవ్యవస్థలో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

**పాతమంచిర్యాల:** న్యాయవ్యవస్థలో బీసీలకు రిజర్వేషన్‌లు అమలు చేయాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజూకు లేఖ రాసి పోస్టులో పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 60శాతం బీసీల జనాభా ఉందని, జనాభా ప్రాతిపదికన పరిగణిస్తే న్యాయవ్యవస్థలో బీసీలకు 50శాతం వాటా దక్కాల్సి ఉందని, కానీ ప్రస్తుతం రెండు శాతం మాత్రమే బీసీలు న్యాయవ్యవస్థలో కొనసాగుతున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. సుప్రీం కోర్టులో ఇప్పటి వరకు 600 మంది జడ్జీలుగా పనిచేశారని, అందులో బీసీలు ఒక్కరు కూడా లేరన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని బీజేపీ ప్రభుత్వానికి, కేంద్ర న్యాయశాఖ మంత్రికి తమ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు. నాయకులు ఇన్నారం కిరణ్, గుండోజు రమేష్, కుమార్ ఉన్నారు.

### కృత్రిమ గర్భధారణతో లాభాలు

**బెల్లంపల్లిరూరల్:** పశువుల్లో కృత్రిమ గర్భధారణతో మేలైన జాతీ పశువుల ఉత్పత్తితో లాభాలు కలుగుతాయని జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లి మండలంలోని పాతబెల్లంపల్లి గ్రామంలో ఆకెనపల్లి పశువైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచ్ రాజలింగు, చంద్రవెల్లి పీఏసీఎస్ చైర్మన్ స్వామి ఉన్నారు.

### నిబంధనలు పాటించాలి

**బెల్లంపల్లిరూరల్:** ఫెర్టిలైజర్ దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ రైతులకు నాణ్యమైన ఎరువులు , విత్తనాలు విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.కల్పన అన్నారు. కన్నాల రైతు వేదికలో బెల్లంపల్లి డివిజన్ ఫెర్టిలైజర్ దుకాణాదారులకు ఆన్‌లైన్ లైసెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయ టెక్నికల్ అధికారి శ్రీనివాస్, అధికారులున్నారు.


# నాందేడ్ సభ ఏర్పాట్ల పరిశీలన

**ఆదిలాబాద్‌టౌన్:** మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఫిబ్రవరి 5న జరిగే సభ ఏర్పాట్లను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమ పథకాలను దేశ వ్యాప్తంగా అమలు చేసేందుకు టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారిందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సభలో చేరికలు, రైతు సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు.



ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న దృశ్యం

# సింగరేణి ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



పెర్క భీమయ్య


**మందమర్రిరూరల్:** మందమర్రి ఏరియాలో ఉత్తమ ఉద్యోగుల లిస్టును ఏరియా అధికారులు మంగళవారం జీఎం ఆఫీస్ హెచ్‌వోడీ శ్యాంసుందర్ ప్రకటించారు. సింగరేణిలో ఉత్తమ అధికారిగా ఆర్కే ఓసీలో అడిషనల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న కరంపూడి రామరాజు, ఉత్తమ సింగరేణి ఉద్యోగిగా కేకే–5 గనిలో కోల్ కట్టర్‌గా విధులు నిర్వహించే పెర్క భీమయ్యను ఎంపిక చేశారు. అలాగే మరో 16 మందిని ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేశారు. వారిలో బల్ల వెంకటేశం జనరల్ మజ్దూర్, సిద్దం తిరుపతి లైన్‌మెన్ (కాసిపేట), కొట్టాల రాజయ్య ఈపీ ఆపరేటర్, మేకర్తి నర్సయ్య జనరల్ మజ్దూర్ (ఆర్కే ఓసీ), ఆవునూరి తిరుపతి ఎలక్ట్రిషియన్, కంది రాజిరెడ్డి హాలర్ ఆపరేటర్ (ఆర్కే–1ఏ), రాంచందర్ ఈపీ ఆపరేటర్, నాగేశ్వరరావు ఎలక్ట్రిషియన్ (కేకే ఓసీ), ఇందూరి మల్లయ్య కోల్‌కట్టర్, కనకం కరుణాకర్ హెడ్ ఓవర్‌మెన్(శాంతిఖని), పుప్పాల శ్రావణ్‌కుమార్ జనరల్ మజ్దూర్, ముల్కల ప్రభాకర్ ఎలక్ట్రిషన్ (కాసిపేట–2), భీమర సదయ్య మున్షి, భూక్యా రమేష్ టిండాల్ (కేకే–5), పచ్చునూరి రాజనర్సు సీనియర్ మైనింగ్ సర్దార్, కుర్సోత్ హనుమంతు సపోర్ట్‌మెన్ (కేకే–1) ఉన్నారు.

**శ్రీరాంపూర్‌లో..**

**శ్రీరాంపూర్:** గణతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్‌లో ఉత్తమ కార్మికులను యాజమాన్యం ఎంపిక చేసింది. విధి నిర్వాహణలో ప్రతిభ కనబరిచిన వీరిని గురువారం ప్రగతి మైదానంలో జరిగే వేడుకల్లో సతీసమేతంగా సన్మానించనున్నారు. ఆర్కే 5గనికి చెందిన కె. లక్ష్మణ్(సర్వేయర్), పి.శ్రీనివాస్(ఫిట్టర్), ఆర్కే 6 గనికి చెందిన జి.కృష్ణమూర్తి (ఫోర్‌మెన్), అగ్గు రమేశ్ (సీనియర్ మైనింగ్ సర్దార్), ఆర్కే 7 గనికి చెందిన మూల తిరుపతిరెడ్డి (లైన్‌మెన్), పొన్నం లక్ష్మణ్ (సపోర్టుమెన్), ఆర్కే న్యూటెక్ గనికి చెందిన సందేల రాజమౌళి (వెల్డర్), అహ్మద్‌పాషా (కోల్‌కట్టర్), ఎస్సార్పీ 1 గనికి చెందిన తోట సంతోశ్ (సర్వేయర్), చింతం అశోక్ (ట్రామర్), ఎస్సార్పీ 3, 3ఏ గనికి చెందిన మారవేన రాజ్‌కుమార్ (ఎలక్ట్రీషియన్), గుగులోత్ దాల్మియా (కోల్‌కట్టర్), ఐకే 1ఏ గనికి చెందిన గడ్డం మల్లన్న(లైన్‌మెన్), మనెవెట్టి రాజబాబు(హాలేజీ ఆపరేటర్), ఐకే ఓసీపీకి చెందిన కె.వెంకటేశ్వర్ (హెడ్‌ఓవర్‌మెన్), పసుల నరేందర్(జనరల్ మజ్దూర్), శ్రీరాంపూర్ ఓసీపీకి చెందిన వీర్ల మదన్(ఈపీ ఆపరేటర్), మామిడాల శ్రీనివాస్(జనరల్ మజ్దూర్)లు ఉత్తమ కార్మికులుగా ఎంపికయ్యారు.

**ఉత్తమ అధికారిగా సతీశ్‌బాబు**


**రెబ్బెన(ఆసిఫాబాద్):** ఉత్తమ అధికారిగా సివిల్ డీజీఎంగా విధులు నిర్వహిస్తున్న ఆర్. సతీష్ బాబు, ఉత్తమ సింగరేణియన్‌గా ఖైరిగూడ ఓసీపీ ఈపీ ఆపరేటర్ సంపత్ తిరుపతి, ఏరియా స్థాయి ఉత్తమ ఉద్యోగులుగా ఖైరిగూడ ఓసీపీలో వెల్డర్‌గా విధులు నిర్వహించే అదునూరి సుధాకర్, హెడ్ ఓవర్‌మెన్‌గా బల్లి శ్రీనివాస్‌లను ఎంపికచేశారు.




సతీశ్‌బాబు | సంపత్ తిరుపతి | సుధాకర్ | శ్రీనివాసులు

**సింగరేణి ఉత్తమ ఉద్యోగిగా శ్రీనివాస్, అధికారిగా ప్రేంకుమార్**

**శ్రీరాంపూర్:** సింగరేణి వ్యాప్తంగా ఉత్తమ ఉద్యోగులు, అధికారులను ఎంపిక చేసినట్లు డీజీఎం(పర్సనల్) గోవిందరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్ నుంచి ఉత్తమ ఉద్యోగిగా ఆసాం శ్రీనివాస్(ఎస్‌డీఎల్ ఆపరేటర్), ఉత్తమ అధికారిగా వై. ప్రేంకుమార్ (డెప్యూటీ ఎస్ఈ, ఈఅండ్ఎం, ఎస్సార్పీ 3, 3ఏ)లుగా ఎంపికయ్యారు.



ఆసం శ్రీనివాస్



వై. ప్రేంకుమార్

### 27న ఆయా జిల్లాల్లో ఔట్ రీచ్ ప్రోగ్రాం

**కౌటాల:** ఉద్యోగుల భవిష్యత్ నిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 27వ తేదీన నిధి ఆప్కే పీఎఫ్ మీ ముంగిట అనే అంశంపై అవగాహన శిబిరం, ఔట్ రిచ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కరీంనగర్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సెల్వాట్‌కార్ తానయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు అన్ని జిల్లాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో.. ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లో.. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలోని సురభి హోటల్‌లో.. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మయూరి హోటల్‌లోని మినీ ఫంక్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.